
టేక్మాల్ మండలంలోని దుబ్బ గుట్ట జాతరలో గుమ్మటాల బండ్ల ఊరేగింపు


ఉగాది వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లడ్డూలు అందుకుంటున్న భక్తులు


సంగారెడ్డి రాంమందిర్‌పై నుంచి ప్యాలాల లడ్డూలు ఎగురేస్తున్న జగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి

ప్యాలాల లడ్డూలు ఎగరేసిన జగ్గారెడ్డి, జయారెడ్డి

- సంగారెడ్డి రాంమందిర్ వద్ద ఘనంగా ఉగాది

సంగారెడ్డి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం సందర్భంగా సంగారెడ్డి రాంమందిర్ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ముందుగా జగ్గారెడ్డి స్వయంగా డోలక్ వాయిస్తూ భజన గీతాలు పాడారు. అనంతరం కూతురు జయారెడ్డితో కలిసి రాంమందిర్‌పై నుంచి ప్యాలాల లడ్డూ ప్రసాదాలను ఎగరేశారు. వీటిని అందుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. దశాబ్దాల కాలంగా ఆనవాయితీ ప్రకారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి పెద్దసంఖ్యలో మహిళలు, పిల్లలు, ప్రజలు తరలి వచ్చారు. బెల్లం కలిపిన ఈ లడ్డూ ప్రసాదం తినడం వల్ల ఏడాదంతా తీపి వలే ప్రజల జీవితాలు ఉంటాయని చెప్పడమే దీని ఉద్దేశం అని జగ్గారెడ్డి అన్నారు.


పెద్దశంకరంపేటలో

వెల్లివిరిసిన భక్తి పారవశ్యం


7

పలు గ్రామాల్లో ఆలయాల వార్షికోత్సవాలు.. జాతరలు

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్ ఫితర్ - ఈద్గాల వద్ద నమాజుకు ప్రత్యేక ఏర్పాట్లు



సంగారెడ్డి హాస్టల్‌గడ్డలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేసిన షామియానాలు

మెదక్ కల్చరల్/సంగారెడ్డి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు నేడు ఈద్ ఉల్ ఫితర్‌ను జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి నెల పొడుపు కనబడటంతో సోమవారం రంజాన్ పండుగను జరుపుకోనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాలతో పాటు మండల, గ్రామాల్లోని ఈద్గాలు, మసీదులను విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. సంగారెడ్డిలోని హాస్టల్‌గడ్డ ఈద్గా వద్ద, మెదక్ రోడ్డులోని గద్ద బొమ్మ వద్ద ఈద్గా మసీదులో మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేశారు. ఉదయం నిర్వహించనున్న నమాజుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. మెదక్ పట్టణంలోని మజీద్‌ఏ ఉమర్బీన్ ఖత్తాబ్‌లో ఉదయం 7.30 గంటలకు, ఖువ్వతుల్ ఇస్లాం మజీద్‌లో తొమ్మిందిటికి, పెద్ద బజార్ ఈద్గాలో 9.30 గంటలకు, జామ మజీదు, గాంధీనగర్ ఈద్గాలో 10 గంటలకు ప్రార్థనలు ప్రారంభంకానున్నాయి .నమాజు తర్వాత ఇమాంలు ఖురాన్, హదీసులలోని విషయాలు తెలుపుతూ సందేశాన్ని ఇవ్వనున్నారు. సంగారెడ్డి పట్టణంలో తాత్కాలికంగా రోడ్డు కిరువైపుల ఏర్పాటు చేసిన దుకాణాలు కిటకిటలాడాయి. మహిళల ఆభరణాలు, వివిధ డిజైన్‌ల రంగు రంగుల గాజులు, సిరామిక్, గాజు పాత్రలతో తయారు చేసిన గృహోపకరణాలు, టోపీలు, పండుగ సందర్భంగా అవసరమయ్యే వస్తువులు, వంట సామగ్రి కొనుగోలుకు పెద్దఎత్తున మార్కెట్‌కు రావటంతో సందడి నెలకొన్నది.

గుమ్మాలకు మామిడి తోరణాలు.. ఇంటింటా షడ్రుల పచ్చడి.. భక్షాల ఘుమఘుమలు.. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలతో ఊరూరా ఉగాది వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఆలయాల్లో పండితులు పంచాంగ పఠనం గావించారు. విశ్వావసు అంటే విశ్వంలోని సంపద, విశ్వానికి సంబంధించిన శ్రేష్ఠత అని అర్థమని తెలిపారు. ఈ నూతన సంవత్సరం విశ్వానుకులమని, శుభప్రదంగా ఉంటుందన్నారు.


అందోలు మండలం డాకూరులో పంచాంగ పఠనం

శుభప్రదం

వైభవంగా ఉగాది వేడుకలు

ఇంటింటా పచ్చడి స్వీకరణ

కిటకిటలాడిన ఆలయాలు

పండితుల పంచాంగ పఠనం

మెదక్ అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినాన తీపి, ఉప్పు, చేదు, పులుపు, కారం, వగరులైన బెల్లం, వేపపువ్వు, చింతపండు, పచ్చి మామిడి ముక్కలు, మిరప పొడులతో ఆరు రుచుల ఉగాది పచ్చడిని తయారు చేసుకొని ప్రసాదంగా తీసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తమ ఇష్ట దైవాలను దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులకు తమ రాశి, నక్షత్రాలను తెలిపి ఆదాయ, వ్యయాలు, రాజపూజ్యం, అవమానాలను తెలుసుకున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీఅయ్యప్ప ఆలయం, కోదండ రామాలయం, వెంకటేశ్వరాలయాల్లో వైద్య రాజు పంతులు, భాష్యం మధుసూదన్‌చార్యులు, వైద్య శ్రీనివాసశర్మ పంచాగ పఠనం గావించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద హిందూ వాహిని ఆధ్వర్యంలో ప్రజలకు పచ్చడి పంపిణీ చేశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన పంచాగ శ్రవణం కార్యక్రమంలో పెద్దఎత్తున్న ప్రజలు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి ఆలయంలో డాక్టర్ విఠలేశ్వరశర్మ పంచాంగ పఠనం గావించారు.


సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పోచమ్మ ఆలయంలో ఉగాది కార్యక్రమానికి హాజరైన స్థానికులు


పండుగల వెనుక శాస్త్రీయత

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మన పండుగలు, ఆచారాలు, సంప్రదాయాల వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టర్ దంపతులు ఏడుపాయల వనదుర్గమాతను దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది పండుగ వసంతకాలం రాకను సూచిస్తుందని, ఆరోగ్యపరంగా చూస్తే వసంత రుతువు ప్రారంభంలో వచ్చే కొన్ని రకాల వ్యాధులకు విరుగుడు ఈ వేపపువ్వు వేసి చేసిన ఉగాది పచ్చడి అని తెలిపారు. ఉగాదిని ప్రకృతి పండుగగా భావి స్తామపి పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ కుటుంబ సమేతంగా వన దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యా, వైద్య రంగాల్లో మెదక్ జిల్లాకు గుర్తింపు

- వేద పండితుడు వైద్య శ్రీనివాసశర్మ



ఈ నూతన సంవత్సరంలో విద్యా, వైద్య రంగాల్లో రాష్ట్రస్థాయిలో మెదక్ జిల్లాకు గుర్తింపు వస్తుందని వేద పండితుడు వైద్య శ్రీనివాసశర్మ తెలిపారు. మెదక్ పేరు మీద ముఖ నక్షత్రం కావున సింహరాశి అని, గురుడుది పదకొండవ స్థానమని తెలిపారు. మంచి, చెడు మిశ్రమంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో మెదక్ జిల్లాకు మంచి పేరు వచ్చే అకాశం ఉంటుందన్నారు. కవులు, కళాకారులు, క్రీడాకారులు రాణిస్తారన్నారు. పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉంటారని, పంటలు బాగా పండి ఆహార ధాన్యాల కొరత తీరుతుందని పేర్కొన్నారు. అల్పవృష్టితో కొంత ఇబ్బంది కలిగే అవకాశమున్నట్లు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు చెప్పారు. గోధుమలు, మిర్చి, మిరియాలు, కలప, ఎర్రని పదార్థాలు, ఆవాలు, రసాయన ఎరువులు, పశువుల ధరలు పెరుగుతాయని తెలిపారు. యువ నాయకత్వం పెరుగుతుందని, అన్ని ప్రభుత్వ శాఖలు ఉత్సాహంతో పనిచేస్తాయని పేర్కొన్నారు.

డంపుయార్డ్ వద్దంటూ ఆవులతో కలిసి రిలే దీక్ష


రిలే దీక్షలో ఆవులతో రైతులు

జిన్నారం మార్చి, 30 (ఆంధ్రజ్యోతి): ప్యారానగర్‌లో డంప్‌యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నల్లవల్లిలో నిర్వహిస్తున్న ఆందోళన ఆదివారంతో 54వ రోజుకు చేరుకున్నది. ఉగాది సందర్భంగా గుమ్మడిదలలో రైతు సంఘం ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఆవులతో కలిసి రిలే దీక్ష చేశారు. భూమాతను రక్షించాలని మట్టికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, నాయకులు మద్దుల బాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఎల్లయ్య, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పస్తాపూర్‌లో మహిళ హత్య

6

టీ-హబ్‌కు జబ్బు



నిలిచిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు

హెచ్‌బీఏ1సీ, థైరాయిడ్, ఎల్‌ఎఫ్‌టీ పరీక్షలు లేవు

15 రోజులుగా రోగుల ఇబ్బందులు

గందరగోళంగా నిర్వహణ

అయోమయంలో వైద్యాధికారులు, ఎల్‌టీలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : వైద్య చికిత్సలో వ్యాధి నిర్ధారణ పరీక్షలదే కీలకం. వీటి ఖర్చు కూడా ఎక్కువే. పేద, మధ్య తరగతి వర్గాల రోగులకు ఆ భారం తగ్గించేందుకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ డయాగ్నోస్టిక్(టీ-హబ్) కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులు, బస్తీ దవాఖానాలలో సేకరించిన రక్త నమూనాలను టీ-హబ్‌కు చేర్చి పరీక్షలు చేసి నివేదికలు పంపిస్తున్నారు. వైద్యులు వాటికి అనుగుణంగా చికిత్స అందిస్తుంటారు. అయితే, కొన్ని రోజులుగా టీ-హబ్‌లో పలు రోగ నిర్ధారణ పరీక్షలు నిలిచాయి.

రసాయనాలు లేక టెస్టులకు బ్రేక్ !

రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవసరమైన రసాయనాలు(రీఏజెంట్స్)సరఫరా నిలిచింది. పైనుంచి రసాయనాల సరఫరా నిలిచిపోవడంతోనే హెచ్‌బీఏ1సీ, థైరాయిడ్‌లో టీ-3, టీ-4, ఎల్‌ఎఫ్‌టీ(టోటల్ బిలురుబిన్, డైరెక్ట్ బిలురుబిన్, ఏఎస్‌టీ) పరీక్షల నిర్ధారణ నిలిచిపోయాయని టీ-హబ్ నిర్వహకులు తెలిపారు. పదిహేను రోజులుగా కీలకమైన పరీక్షలు నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న పోస్టులు

టీ-హబ్‌లో నిత్యం ఏయే పరీక్షలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని ఏరోజుకారోజు టీ-హబ్ నిర్వహకుడు సంబంధిత ఆస్పత్రుల గ్రూపుల్లో పోస్టు చేస్తారు. వాస్తవానికి ప్రస్తుతం నిలిచిన ఆయా టెస్టులు టీ-హబ్‌లో చేసేందుకు వెసులుబాటు ఉన్నది. కానీ టీ-హబ్ నిర్వహకుడు మాత్రం జీజీహెచ్, ఎంసీహెచ్ గ్రూపుల్లో ఆ టెస్టులు ఉన్నాయని, అదే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వాట్సప్ గ్రూపుల్లో మాత్రం అందుబాటులో లేవని పోస్టు చేయడం గమనార్హం. వైద్య అధికారులు ల్యాబ్ టెక్నీషియన్లను(ఎల్‌టీ) తప్పుదోవ పట్టించడంతో పాటు రోగులను ఇబ్బందులకు గురి చేసేలా ఆయా గ్రూపుల్లో అవాస్తవాలను పోస్టు చేయడం అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దంపడుతున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. టీ-హబ్‌లో జరుగుతున్న వాస్తవ, అవాస్తవ పరిణామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పడుతున్న ఇబ్బందులను తీర్చాలని రోగుల కోరుతున్నారు.



కస్తూర్బా ఎదుట.. కన్నవారికి తప్పని ఎదురుచూపు

శివ్వంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ నాడు తమ పిల్లలకు పచ్చడి, భక్షాలను ఇవ్వడానికి వచ్చిన తల్లిదండ్రులను కస్తూర్బా పాఠశాలలోనికి అనుమతించకపోవడంతో నిరసన వ్యక్తం చేసిన సంఘటన గూడూరు కస్తూర్బా పాఠశాల వద్ద ఆదివారం చోటుచేసుకున్నది. 20 తండాలకు చెందిన 100 మంది వరకు తల్లిదండ్రులు తమ పిల్లల కోసం గేటు వద్ద ఎండలో మూడు గంటల పాటు నిరీక్షించారు. ఉగాది రోజున అనుమతిస్తామని మూడు రోజుల క్రితం తెలపడంతోనే ఎంతో దూరం నుంచి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మంజులను సంప్రదించగా విద్యార్థులకు చివరి పరీక్ష ఉన్నందున లోనికి అనుమతించవద్దు అని అధికారులు ఆదేశించారని తెలిపారు. లోనికి వెళ్లకుండా గేటు పైనుంచి తీసుకుని ఇవ్వమని సిబ్బందికి చెప్పామని తెలిపారు.

161 జాతీయ రహదారిపై టోల్ బాదుడు

- రేపటి నుంచి తాడ్దానిపల్లి టోల్‌ప్లాజాలో పెరిగిన చార్జీలు అమలు

పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి టోల్ చార్జీలను స్వల్పంగా పెంచారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) కేంద్ర ఉపరితల రవాణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భారత్‌మాల పరియోజన పథకం కింద మూడేళ్ల క్రితం సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించగా, చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజా వద్ద ఫీజు వసూలు చేస్తున్నారు. సవరించిన ధరల పట్టికను టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేశారు. నెలవారి లోకల్ పాస్‌ను సైతం రూ.10 పెంచగా, ప్రస్తుతం రూ.350 అయింది. ఏప్రిల్ 1 నుంచి ఈ టోల్ ఫీజులు అమలులోకి రానున్నాయి.

Category of Vehicle	Fee For Single Journey (in Rs.)	Fee For Return Journey Within a day (in Rs.)	Fee For Monthly Pass For 50 Single Journey (in Rs.)	Fee For Single Journey For the Commercial vehicle Registered Within the District of Fee Plaza (in Rs.)
2	3	4	5	6
Car, Jeep, Van, or Light Motor Vehicle	130	195	4345	65
Light Commercial Vehicle, Light Goods Vehicle or Minibus	210	315	7020	105
Bus or Truck (2 Axle)	440	660	14710	220
Three-axle Commercial Vehicles	480	720	16045	240
Heavy Construction Machinery (HCM), Earth Moving Equipments (EME) or Multi Axle Vehicle (4 to 6 Axles)	690	1040	23065	345
Oversized Vehicles (7 or Axles)	840	1265	28080	420

తాడ్దానిపల్లి శివారులోని టోల్‌ప్లాజా వద్ద సవరించిన టోల్ చార్జీల పట్టిక

పండుగకు అమ్మమ్మ ఇంటికి వస్తూ

అనంతలోకాలకు..

● ఆటోను ఢీకొన్న అడవి పందుల గుంపు

● యువకుడి దుర్మరణం



భానుచందర్ మృతదేహం

రామయంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగకు అమ్మమ్మ ఇంటికి వస్తూ.. ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ (24) పని నిమిత్తం శనివారం ఆటోలో మేడ్చల్ ప్రాంతానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి తిరుగు ప్రయాణంలో తన అమ్మమ్మ స్వగ్రామమైన సుతార్పల్లికి వస్తున్నాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునే క్రమంలో ఒక్కసారిగా అడవి పందుల గుంపు వచ్చి ఆటోను ఢీకొనడంతో అదుపుతప్పి బోల్తా పడిపోయింది. భానుచందర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఆదివారం తెల్లవారుజామున అటుగా వెళ్తున్న వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన ఓ అడవి పందిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ గుంతలో యువకుడి గల్లంతు!

తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్వారీ గుంతలో స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రభాకర్(35) కుటుంబీకులు ఎవరు లేకపోవడంతో ఒంటరిగా తూప్రాన్ పట్టణ పరిధిలోని కరీంగూడలో నివాసముంటూ క్వారీలో రాళ్లను ట్రాక్టర్‌లో నింపే కూలిగా చేస్తున్నాడు. శనివారం పని అనంతరం స్నానం చేసేందుకు స్థానికంగా ఉన్న ఓ క్వారీ గుంత నీటిలోకి దిగి గల్లంతయ్యాడు. శనివారం రాత్రి నివాసానికి, ఆదివారం పనికి రాకపోవడంతోపాటు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో క్వారీ ఒడ్డున అతడి బట్టలు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ప్రభాకర్‌కు మూర్ఛవ్యాధి ఉందని ఈ క్రమంలో నీటిలో మునిగిపోయి ఉంటాడని భావిస్తున్నారు. కాగా, క్వారీలో గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు.

చెరువులో దూకిన వ్యక్తి..

తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భార్య గొడవ పడిన వ్యక్తి చెరువులో దూకగా గల్లంతయ్యాడు. కాలనీ వాసులు, పోలీసుల కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ ఎస్సీ కాలనీకి చెందిన దాసరి యాదగిరి(40) ఆదివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉగాది రోజున తాగిరావడంపై భార్యతో గొడవ జరగడంతో తాను చనిపోతానంటూ యాదగిరి ఇంట్లో నుంచి బయటకెళ్లాడు. అతడు గ్రామ సమీపంలో ఉన్న మ్యాడక చెరువులో దూకినట్లు కాలనీవాసులు తెలుపడంతో రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా యాదగిరి ఆచూకీ లభించలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

భార్య కాపురానికి రావడం లేదని

భర్త ఆత్మహత్య



వేణుగోపాల్ (ఫైల్)

మాసాయిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం పోతన శెట్టిపల్లి గ్రామానికి చెందిన బండారి వేణుగోపాల్(31) భార్య దీపిక రెండు నెలలుగా కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు శనివారం రాత్రి ఇంట్లో చీర కొంగుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వేణుగోపాల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో నవ వరుడు..



ప్రవీణ్ (ఫైల్)

జోగిపేట రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో నవ వరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాడ్మన్నూర్ గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్ (24)కు రెండు నెలల క్రితం సదాశివపేట మండలం నిజాంపేటకు చెందిన ఓ యువతితో వివాహమైంది. కొన్ని రోజులుగా వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకెళ్లిన ప్రవీణ్.. పొలం వద్ద ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి తండ్రి చాలకి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

నారాయణఖేడ్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికైన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంగరి భోజిరెడ్డిని ఆదివారం ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి శాలువాలతో సన్మానించి, మిఠాయిలను తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

పస్తాపూర్‌లో మహిళ హత్య



మ్యాతరి లక్ష్మి(ఫైల్)

జహీరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం పస్తాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలనీలో మ్యాతరి లక్ష్మి(45) అనే మహిళ ఆదివారం ఉదయం హత్యకు గురైంది. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఝరాసంగం మండలం చీలమామిడికి చెందిన మ్యాతరి లక్ష్మి కొంతకాలంగా పట్టణంలోని పస్తాపూర్‌లో నివాసముంటూ కూలీ పనులకు వెళ్తున్నది. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి ఆమెను హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్ని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టూ కారంపొడి చల్లి ఉండడం, అక్కడే గ్యాస్ సిలిండర్ ఉండడంతో కళ్లలో కారం చల్లి, కొట్టి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. జాగిలాలతో తనిఖీలు నిర్వహించినా ఆనవాళ్లు లభించలేదు. మృతురాలి చెల్లెలు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి పట్టణ సీఐ శివలింగం చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

● మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ నేపథ్యంలో ఘటన



షాబొద్దీన్ మృతదేహం

గజ్వేల్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొడుకు చేతిలో తండ్రి హత్యకు గురైన ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పటేల్ బజారుకు చెందిన ఎండి షాబొద్దీన్(54)కు భార్య రజియాబేగం, కొడుకు షాకేర్, కూతురు ఉన్నారు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న షాబొద్దీన్‌కు అతని కొడుకు షాకేర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వంటింట్లోకి వెళ్లిన షాబొద్దీన్ కాలుజారి కింద పడడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే రజియాబేగం షాబొద్దీన్‌ను పక్కకు తీసుకువెళ్లింది. అర్ధరాత్రి సమయంలో షాబొద్దీన్ నిద్రిస్తుండగా షాకేర్ అతని మెడకు తాడును బిగించి చంపేందుకు ప్రయత్నించాడు. గమనించిన రజియాబేగం అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. షాబొద్దీన్ పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దశంకరంపేటలో బండ్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు



వెల్లివిరిసిన భక్తి పారవశ్యం

● పలు గ్రామాల్లో ఆలయాల వార్షికోత్సవాలు.. జాతరలు ● ఘనంగా బండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని దుర్గమ్మ ఆలయం చుట్టూ ఆదివారం సాయంత్రం ఎడ్ల బండ్ల ఊరేగింపు కనులపండగగా జరిగింది. ముందుగా పేటలోని పలు పురవీధుల గుండా భాజాభజంత్రీలు, యువకులు నృత్యాలు మధ్య బండ్ల ఊరేగింపు నిర్వహిస్తూ ఆలయానికి చేరుకున్నారు. దుర్గమ్మ ఆలయం అనంతరం కొండల రాయిని గుడి, పోచమ్మ ఆలయ చుట్టూ బండ్లను ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పొట్టేలు ఫలహారం బండ్లు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

● బెజ్జంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చుట్టూ పలు గ్రామాల రైతులు ఎడ్లబండ్లను తిప్పారు.

● చిలప్‌చెడ్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని అజ్జమర్రి, ఫైజాబాద్, చిలప్‌చెడ్ గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్లను ఊరేగించారు.



చిలప్‌చెడ్ : ఎడ్ల బండ్ల ఊరేగింపు..



● దుబ్బగట్టు జాతర

టేక్మాల్, మార్చి30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దన్నూర గ్రామ శివారులోని దుబ్బగట్టు జాతర షురూ అయ్యింది. ఐదు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం గుముటాల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. పల్వంచ, బర్దిపూర్, మల్కాపూర్, కుసంగి దాదాయిపల్లి గ్రామాల నుంచి బండ్లు ఊరేగింపుగా తరలివచ్చాయి.



● మత్తడి పోచమ్మ జాతర షురూ...

నారాయణఖేడ్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో ఆదివారం మత్తడి పోచమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ బాధ్యులు భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ తాజామాజీ వైస్‌చైర్మన్ దారం శంకర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



● కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవాలు

పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లోని పురాతనమైన అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1 వరకు జరిగే ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ధ్వజ రోహణం, అభిషేకం, బండ్లు తిరుగుట, స్వామి వారి రథోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తీర్థాల రామకృష్ణ ఆలయ మంటపంలో పంచాంగ పఠనం వినిపించారు. ఆలయంలోని మహా శివలింగానికి గ్రామానికి చెందిన కటకం సుధాకర్‌గౌడ్-సుధారాణి దంపతులు బంగారంతో తయారు చేయించిన మూడో కన్నును బహూకరించారు.



●నేత్రపర్వం శతఘటాభిషేకం



శతఘటాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితుల

వర్గల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు శతఘటాభిషేకంతో ఆదివారం ముగిశాయి. ఆలయ మండపంలో స్వామివారికి శతఘటాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం పురస్కరించుకుని విశేష పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ పర్యవేక్షణల ముగింపు వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, జగన్నాథ చార్యులు, నాగరాజు శర్మ, హరిప్రసాద్ శర్మ, గోపాలకృష్ణ శర్మతో పాటు ఆలయ అధికారులు సుదాకర్, నరేందర్, పాండు పాల్గొన్నారు.

● రమణీయం.. రథోత్సవం

శివ్వంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో భర్మస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ స్వామివారిని నిజామాబాద్, భైంసా, దేవరకొండ, శంషాబాద్, మహారాష్ట్ర గిరిజనులు ఇలవేల్పుగా కొలుస్తూ పెద్ద సంఖ్యలో హాజరై మూడు రోజులపాటు ఇక్కడే బస చేసి రథోత్సవంలో పాల్గొనడం విశేషం. ఆలయ చైర్మన్ పిల్లి శివశంకర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. పలువురు ప్రముఖులు ఉత్సవాలకు హాజరయ్యారు.



‘విశ్వావసు’లో మరింత ప్రగతి

● కొమురవెల్లి మల్లన్న ఆలయ ఆదాయం-11, వ్యయం-11

● వీరశైవాగమ పండితుడు ఆనందయ్య



పంచాంగ పఠనం చేస్తున్న వీరశైవాగమ పండితుడు ఆనందయ్య

చేర్యాల, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి) : భక్తుల పాలిట కొంగుబంగారంగా విలసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం విశ్వావసు నామ సంవత్సరంలో మరింత అభివృద్ధి చెందుతుందని వీరశైవాగమ పండితుడు ఆనందయ్య జోస్యం చెప్పారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కొమురవెల్లి మల్లన్న ఆలయ ముఖమండపంలో పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లన్నకు ప్రత్యేకపూజలు జరిపిన అనంతరం రాశుల వారీగా ఫలితాలు వివరించారు. కొమురవెల్లి మల్లన్నది సింహరాశి అని, మల్లన్నకు ఆదాయం- 11, వ్యయం-11ఉన్నందున మౌలికవసతుల కల్పనలో సమాంతర అభివృద్ధితో మరింత ఉన్నతబాటలో పయనిస్తుందన్నారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. విద్యవైద్యం, భవన నిర్మాణరంగాల వారికి శుభసూచకంగా ఉంటుందని, పశుసంపద పెరుగుతుందన్నారు. గతసంవత్సరంలో అనుభవించిన బాధలన్నీ ప్రస్తుత విశ్వావసులో తీరుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, కాయిత మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకసంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఒగ్గు పూజారులసంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానార్చకుడికి ఉగాది పురస్కారం

కొమురవెల్లి మల్లన్న ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉగాది పురస్కారం వరించింది. ఆదివారం దేవాదాయశాఖ, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌లు ఆయనను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రం, నగదు పురస్కారానికి అందజేశారు. మల్లికార్జున్‌ను ఆలయ అధికారులు, అర్చకులు, ఉద్యోగులు అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న మల్లన్న ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్

ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి

దౌల్తాబాద్,మార్చి (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతిచెందాడు. దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. నందేడ్ జిల్లా మాచునూర్ గ్రామానికి చెందిన ఐర్వా ఎడకే(45) తన భార్య పిల్లలతో కలిసి రెండు నెలల క్రితం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి వచ్చి చింతకింది నాగరాజుకు చెందిన ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. ఆదివారం ఇందుప్రియల్‌లోని రామాయంపేట కెనాల్‌లో ఈత కోసం వెళ్లిన ఎడకే ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ సిబ్బందితో అక్కడికి చెరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చందర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తన భర్త మృతితో తమ కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య కోరింది.



ఎడకే మృతదేహం

కొత్త సంవత్సరంలో ప్రజలందరికీ శుభం కలగాలి

● నీలం మధు ముదిరాజ్

ముదిరాజ్ పటాన్‌చెరు రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : విశ్వావాసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెలుగు నామ సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తన స్వగ్రామం చిట్కుల్‌లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు



పల్లకి సేవలో పాల్గొన్న నీలం మధు



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తులరద్దీ

మల్లన్న ఆలయం.. భక్తజన సందోహం

చేర్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం శాక పెట్టి బోనం నివేదించారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులుకట్టారు. ఆలయ ఈవో రామాంజనేయు లు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మల్లన్న భక్తుల సెల్‌ఫోన్లు అపహరించిన మహిళ

● దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన పలువురు భక్తుల సెల్‌ఫోన్లు అపహరించిన ఓ మహిళను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆదివారం మల్లన్నను దర్శించుకున్న భక్తులు గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పట్నాలు రచించి చెట్టుచుట్టూ ప్రదక్షిణలు చేయడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. పాదాల మండపంలో పలువురు తమ సామగ్రితో బసచేయగా, సందట్లో సడేమియా అన్న చందంగా చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ సెల్‌ఫోన్ అపహరిస్తూ పట్టుబడింది. భక్తులు దేహశుద్ధి చేసి ఆమె వద్ద తనిఖీ చేయగా రెండు సెల్‌ఫోన్లు లభ్యమయ్యాయి. దీంతో ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఆమెను మందలించి వివరాలు నమోదు చేసుకుని పోలీసులకు అప్పగించారు.

నేటి నుంచి రేణుకాంబ ఆలయ వార్షికోత్సవాలు

సంగారెడ్డి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం హౌసింగ్‌బోర్డుకాలనీలో గల రేణుకాంబ(ఎల్లమ్మ) ఆలయ వార్షికోత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగే వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని వివిధ రంగులు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 31న గణపతి పూజ, పుణ్యావాచన, మాతృక, యోగినీ, వాస్తు, నవగ్రహ, మండల దేవతాస్థాపనం, ఏప్రిల్ ఒకటిన అమ్మవారికి మహాభిషేకం, ఆవాహిత దేవతా హోమం, రుద్ర చండీయాగం, పూర్ణాహుతి, 2న గంగ పూజ, అమ్మవారి కలాణ్యం, 3న బోనాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.





ఉప్పరపల్లి సమ్మక్క సారలమ్మ జాతరకు వేళాయే

● నేడు అమ్మవార్లను గద్దె ఎక్కించుట, కల్యాణం

దౌల్తాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లి గ్రామం ఉప్పర చెరువు ఉడల మర్రి చెట్టు కింద వెలిసిన సమ్మక్క సారలమ్మ జాతర నేటి నుంచి మూడు రోజుల పాటు జరుగనుంది. ఆలయం వద్ద ప్రతీ రోజు రాత్రి 8 గంటలకు కుక్కల ఐలయ్యచే అమ్మవార్ల జీవిత చరిత్రను తెలియజేయనున్నారు. సోమవారం ఉదయం దేవతలను గద్దెను ఎక్కించనుండగా, మధ్యాహ్నం బోనాల ఊరేగింపు, సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఎడ్ల బండ్ల ఊరేగింపు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

గ్రూప్-1లో యువకుల సత్తా

● ప్రణయ్‌సాయికి 17వ ర్యాంకు..



తూప్రాన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌పట్టణానికి చెందిన బోయినపల్లి ప్రణయ్‌సాయి గ్రూపు-1 ఫలితాల్లో 513 మార్కులతో రాష్ట్రస్థాయి 17వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయినపల్లి విష్ణువర్ధన్, శ్రీవిద్య దంపతుల కుమారుడైన ప్రణయ్‌సాయి ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. గ్రూపు-4 ఫలితాల్లోనూ సత్తా చాటి చేగుంట రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూపు-2లో 134వ ర్యాంకు, గ్రూపు-3లో 148వ ర్యాంకు సాధించగా, ప్రస్తుతం గ్రూపు-1 ఫలితాల్లో 17వ ర్యాంకు సాధించాడు.

● శభాష్ శైలేష్..



మెదక్ అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో మెదక్ పట్టణానికి చెందిన పూన శైలేష్ సత్తా చాటాడు. 503.500 మార్కులతో శైలేష్ రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు సాధించాడు. పూన రవి, ఝాన్సీ దంపతుల పెద్ద కుమారుడైన శైలేష్ పదో తరగతి అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్, ఇంటర్ నారాయణ కళాశాల, డిగ్రీ ఢిల్లీ యూనివర్సిటీలో చదివాడు. ఎంఏ చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. ఎవరి దగ్గర శిక్షణ తీసుకోకుండానే ఈ ఘనత సాధించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, పట్టుదలతో శ్రమించాడు. రోజుకు 10-12 గంటలు చదివినట్లు తెలిపారు. గ్రూప్స్ రాయాలనుకునేవారు మొదట పరీక్షకు విశ్లేషించుకోవాలని, తర్వాత అవగాహన ఏర్పర్చుకుని ప్రిపిరేషన్ కొనసాగిస్తే విజయం సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ర్యాంకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, డీఎస్పీ పోస్టు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

● మూసాపేట యువకుడికి 73వ ర్యాంకు



పెద్దశంకరంపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండలం మూసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్‌రెడ్డి 73వ ర్యాంకు సాధించారు. మూసాపేటకు చెందిన ఎరగారి శశిధర్‌రెడ్డి, (పీఏసీఎస్ డైరక్టర్), పావని దంపతుల పెద్దకుమారుడైన అతడు రెండు నెలల క్రితం వెల్లడైన గ్రూపు-4 ఫలితాల్లోనూ సత్తా చాటి కొల్చారం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. మెదక్ సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసి, హైదరాబాద్ శ్రీనిధి ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాడు. మూడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రిపేర్ అయ్యాడు.

● ఓ వైపు ఉద్యోగం.. మరోవైపు ప్రిపరేషన్..



కొండపాక, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందారం గ్రామానికి చెందిన నర్ర భగవాన్ రెడ్డి, వజ్రమ్మల కుమారుడు నర్రా అఖిల్ రెడ్డి 75వ ర్యాంకు సాధించాడు. దుద్దెడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య, సిద్దిపేటలో ఉన్నత విద్య పూర్తి చేసిన అఖిల్ రెడ్డి సిద్దిపేటలోని గురుకృప కళాశాలలో ఇంటర్, హైదరాబాద్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేశాడు. 2016లో మల్లన్న సాగర్ ప్రాజెక్టులో ఇరిగేషన్ ఏఈగా ఉద్యోగం సాధించాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. రెండు సార్లు మెయిన్స్ వరకు వెళ్లిన అతను.. చివరకు 75వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. తల్లిదండ్రులతోపాటు భార్య సంఘమిత్ర ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

ఉన్నత ఉద్యోగమే లక్ష్యంగా..



హుస్నాబాద్‌రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన లావుడ్య సోమ్లా- లక్ష్మిదంపతుల పెద్ద కుమారుడు శ్రీకాంత్ 89వ ర్యాంకు సాధించాడు. 2018లో పంచాయతీ కార్యదర్శిగా, ఆ తర్వాత వీఆర్‌వో ఉద్యోగం పొందారు. అనంతరం ఎస్‌ఐ కాడమే లక్ష్యంగా పట్టుదలతో శ్రమించి విజయం సాధించాడు. ఉమ్మిడి కరీంనగర్ జిల్లా చందుర్తిలో ఎస్‌ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్.. జోనల్ వ్యవస్థ మార్పులో భాగంగా ప్రస్తుతం రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీరావుపేట ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. అయినా ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపనతో ఓ వైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. తాజాగా గ్రూప్-1 ఫలితాల్లో 89వ ర్యాంకు సాధించాడు.

న్యూస్ బాక్స్

అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటుకు యత్నిస్తే చర్యలు

రామచంద్రాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా విగ్రహాల ఏర్పాటుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ హెచ్చరించారు. తెల్లాపూర్‌లోని రేడియల్ రోడ్డు 7 ఎక్స్‌టెన్షన్‌పై ఉన్న ప్రధాన సర్కిల్లో చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు శనివారం అర్ధరాత్రి దిమ్మె నిర్మాణానికి కొందరు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న కొల్లూరు పోలీసులు సీఐ రవీందర్ ఆధ్వర్యంలో అక్కడ మోహరించారు. వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. యువకులతో సీఐ మాట్లాడుతూ అనుమతి లేనిదే ఇక్కడ ఎలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయరాదని సూచించారు. విగ్రహం ఏర్పాటు చేయదలుచుకుంటే ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కాగా విగ్రహ ఏర్పాటు కోసం వచ్చిన యువకులు అన్ని రాజకీయ పార్టీల నాయకులు విగ్రహం ఏర్పాటుకు నిర్ణయించారని, గతంలో పాలకవర్గం విగ్రహాల ఏర్పాటుకు తీర్మానం చేశారన్నారు. సున్నితమైన అంశాల విషయంలో అనుమతులు తీసుకుని ముందుకు సాగాలని సీఐ సూచించారు.

ముస్లింలకు తోఫాల పంపిణీ



నిరుపేద ముస్లింలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తోఫాలు పంపిణీ చేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని పలు పేద ముస్లిం కుటుంబాలకు డీసీసీ ప్రధాన కార్యదర్శి, లయన్స్ క్లబ్ జిల్లా డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ పండుగకు అవసరమగు తోఫాలను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, ఇతర బాధ్యులు పండరినాథ్, చంద్రశేఖర్, రవికుమార్, రాజ్‌కుమార్, అబ్రార్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కీబాత్ తిలకించిన నాయకులు



మన్‌కీబాత్ వీక్షిస్తున్న మాజీ జడ్పీచైర్‌పర్సన్ రాజమణిమురళీధర్‌యాదవ్ దంపతులు

నర్సాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని నర్సాపూర్‌లో బీజేపీ నాయకులు పలువురు వీక్షించారు. అందులో మాజీ జడ్పీచైర్‌పర్సన్ రాజమణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్ దంపతులతో పాటు నాయకులు ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య, దేవేందర్ యాదవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జోగిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీ.రవిశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది సంతోష్‌కుమార్, కోశాధికారిగా మున్నూరు మల్లేశం ఎన్నికయ్యారు. కాగా ఉపాధ్యక్షులుగా జీఆర్ మధుసూదన్‌రెడ్డి, జాన్‌పాల్, జాయింట్ సెక్రెటరీగా కొత్త శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

'ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు నాటాలి'

నర్సాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో వన్యప్రాణులతో పాటు కోతులకు తినేందుకు ఆహార పదార్థాలు లేకపోవడం వేల్ల ఇళ్ల మధ్యకు వస్తున్నాయని, కోతుల బెడద లేకుండా ఖాళీ స్థలాల్లో పండ్ల మొక్కలు నాటాలని కాంగ్రెస్ నాయకుడు పైడి శ్రీధర్‌గుప్తా పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంతో పాటు ఖాళీ ప్రదేశాల్లో ప్రతియేటా హరితహారం పేరిట కోట్ల రూపాయలు వెచ్చించి మొక్కలు పెడుతున్నా అవి దేనికీ ఉపయోగపడవని, వాటిస్థానంలో పండ్ల మొక్కలు నాటితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కారం గ్రామ శివారులోని ఓ పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు ఆదివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొన్నారు. నిందితుల నుంచి రూ.5,999నగదు, 4 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



నారాయణఖేడ్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన పంచాగ శ్రవణంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, తదితరులు



జహీరాబాద్ పట్టణంలో పంచాంగ పఠనం చేస్తున్న పలువురు వేదపండితులు, పాల్గొన్న గ్రామస్థులు

ఘనంగా ఉగాది

ఉగాది వేడుకలను ఆదివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన చౌరస్తాల వద్ద పండితులచే పంచాంగ పఠనం నిర్వహించారు. పండితులు రాశుల వారీగా ఆదాయ, వ్యయాల వివరాలు, రాశుల ఫలితాలు తెలిపారు.

- న్యూస్ నెట్‌వర్క్



మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో నిర్వహించిన పంచాగ శ్రవణంలో గ్రామస్థులు



కోహీర్ మండలం బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న వేదపండితులు

రోడ్డు విస్తరణ పనుల్లో 'భగీరథ' పైపులు ధ్వంసం

- నిమ్మకునీరెత్తిన మున్సిపల్ అధికారులు
- పట్టించుకోని జలమండలి
- తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు



ముత్తంగిలో పైపులు పగిలి వృథాగా పోతున్న నీరు



పైపు పగిలి నిర్మాణంలోకి చేరిన నీరు

రామచంద్రాపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు పగిలిపోతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్ కూడలి నుంచి పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం, లింగంపల్లి కూడలి నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా రోడ్డు విస్తరించడానికి వరదకాలువ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మిషన్‌భగీరథ పైపులైన్లు రోడ్డుకు ఆనుకొని ఉన్నాయి. కాలువ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతుండడంతో భూమిలో ఉన్న పైపులు పగులుతున్నాయి. దీంతో నీరు వృథాగా పారడమే కాకుండా.. చుట్టుపక్కల 10 పైచిలుకు కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోతున్నది. దీనిపై స్థానికులు ఎప్పటికప్పుడు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. మరమ్మతులు చేయించినా రెండురోజులకే మళ్లీ పైపులు పగులుతున్నాయి. ఫలితంగా ఆరు నెలలుగా ముత్తంగి, చిట్కుల్ గ్రామాల్లోని 10 పైచిలుకు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

అధికారుల పర్యవేక్షణ ఏది..?

అభివృద్ధి పని జరుగుతున్న సమయంలో రోడ్లు భవనాలశాఖ, జలమండలి, మున్సిపల్ ట్రాన్స్‌కో శాఖలకు సంబంధించిన అధికారులు నిత్యం పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. ఆర్అండ్‌బీ అధికారులు సైతం కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ముత్తంగి అవుటర్ జంక్షన్ దాటిన తరువాత ఇస్నాపూర్ వైపు కల్వర్టులు ఉన్నాయి. వాటికి ఆనుకొని వేసిన మిషన్ భగీరథ పైపులు తొలగిస్తున్న సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి జలమండలి అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. 20 రోజులుగా తాగునీటి సరఫరా పూర్తిగా నిలిపివేశారు. కాలనీవాసులు మినరల్ నీటిని కొనుగోలు చేస్తున్నారు. ట్యాంకర్లతో సరఫరా చేయాల్సిన మున్సిపల్, జలమండలి శాఖల అధికారులు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

భూమాతకు 'రైతన్న' పూజలు

- వర్షాలు పడి పంటలు బాగా పండాలని వేడుకోలు



పొలం వద్ద కాడెద్దులకు అంబలి, పరమాన్నం పెట్టి భూమాతకు పూజలు చేస్తున్న రైతు

మునిపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్న రైతన్న వ్యవసాయ పనులు షురూ చేసే శ్రీవిశ్వావసు నామ (ఉగాది) కొత్త సంవత్సరం సందర్భంగా వ్యవసాయ పనిముట్లను బయటకు తీశారు. ఆదివారం తెల్లవారుజామున తమ పొలాల వద్దకు ఐదు చుట్లు అరకతో భూమిని చదును చేశారు. సూర్యోదయం వరకు పూజలు ముగించాలని పురోహితులు చెప్పడంతో ఇంటి నుంచి తీసుకొచ్చిన నైవేద్యం, పరమాన్నం, అంబలిని పశువులకు పెట్టి, మంచి దిగుబడులు, లాభాలు రావాలని భూమాతని వేడుకున్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు



మల్లేపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి ప్రదీప్ తదితరులు

కొండాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనులు జరుపుతునట్లు మల్లేపల్లి గ్రామ ప్రత్యేకాధికారి, డీటీ ప్రదీప్ పేర్కొన్నారు. ఆదివారం మల్లేపల్లిలో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకారంతో మంజూరైన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.9 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి పర్చాలని గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లోని యువతీ,యువకులు యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ విఠల్, మాజీ సర్పంచులు పాండురంగం, మణయ్య, మాజీ ఎంపీటీసీ రాందాస్, గ్రామ పెద్దలు నర్సింహరెడ్డి, జగదీశ్వర్, రామప్ప, సతీష్, మాజీ వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఖేడ్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజన నాయకులు

నారాయణఖేడ్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని దిశ కమిటీ జిల్లా సభ్యుడు ప్రకాష్‌రాథోడ్ అన్నారు. గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యుల్‌లో చేర్చాలని అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసినందుకుగాను ఆదివారం ఖేడ్‌లో గిరిజనులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాలతో ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎనలేని చిత్తశుద్ధి ఉందన్నారు. మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సురేష్‌నాయక్, రాథోడ్‌రాజునాయక్, శ్రీరాం, శంకర్‌నాయక్, రాజు, కల్యాణ్, భరత్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మసాక్షాత్కారంతోనే భగవదనుగ్రహం



పట్టణంలోని నాగదేవత ఆలయం వద్ద నిర్వహించిన నగర సంకీర్తన కార్యక్రమంలో భక్తులు

జహీరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆత్మసాక్షాత్కారంతోనే భగవదనుగ్రహం సిద్ధిస్తుందని హరేక్రిష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్‌ప్రభూజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని నాగదేవత ఆలయం వద్ద నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మసాక్షాత్కారానికి నిరంతరం హరేక్రిష్ణమంత్రాన్ని జపించాలన్నారు.ఇందులో భాగంగా నాగదేవత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నగర సంకీర్తన వైభవంగా జరిగింది. అనంతరం పచ్చడితోపాటు మహాప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే రోహిత్



మల్లన్న కమాన్‌ను ప్రారంభిస్తున్న రోహిత్‌రావు

నిజాంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఆదివారం మల్లన్న ఆలయ కమాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పాటుపడుతుందని తెలిపారు. అనంతరం ఉగాది సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల ఊరేగింపులో పాల్గొని గ్రామస్థులకు, మండల నాయకులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పంజా మహేందర్, నసీరుద్దీన్, ఆలయ కమిటీ చైర్మన్లు రాంరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్/సంగారెడ్డి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. కల్హేర్ మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి సాయిలు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక శివాజీ చౌక్‌లో ఏర్పాటుచేసిన అంబలి కేంద్రాన్ని ఆదివారం భూపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే రాగి అంబలి పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. అనంతరం కల్హేర్‌కు చెందిన పోచబోయిన కవితకు మంజూరైన రూ.27 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రాంసింగ్, మాజీ ఎంపీటీసీలు సంగప్ప, శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణ 12వ వార్డు మాజీ కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వార్డు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు.

హిందూ సమాజ సంఘటన కోసం ఆర్ఎస్ఎస్ కృషి

- మెదక్ విభాగ్ సహ సంపర్క ప్రముఖ్ అంబరీష్



మాట్లాడుతున్న మెదక్ విభాగ్ సహ సంపర్క ప్రముఖ్ అంబరీష్

పెద్దశంకరంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజ సంఘటన కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ నిరంతరం కృషి చేస్తుందని మెదక్ విభాగ్ సహ సంపర్క ప్రముఖ్ అంబరీష్ అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఇందులో భాగంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవరావు బలిరాం పంత్ హేడ్గేవార్ జయంతి నిర్వహించారు. భారతదేశ సనాతన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదన్నారు. ప్రతి ఒక్కరిలో జాతీయతా భావాన్ని నిర్మాణం చేసేందుకు సంఘ శాఖలు నిరంతరం కృషి చేస్తున్నాయని వివరించారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో శాఖలను విస్తరింపజేసేలా స్వయం సేవకులు నిరంతరం కృషి చేయాలన్నారు.

గణేష్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



రుద్రారం గణేష్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు పోటెత్తారు. రుద్రారం గణేష్ ఆలయం భక్తులతో కలకళలాడింది. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఉదయాన్నే రుద్రారం గణేష్ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీని పురస్కరించుకుని ఏర్పాట్లపై ఆయన అధికారులతో మాట్లాడారు. రుద్రారం మాజీ సర్పంచులు సుధీర్‌రెడ్డి, వెంకన్న, పార్టీ నాయకులు పాండు తదితర ప్రముఖులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మ కమిటీలో ఉమ్మడి పుల్కల్ మండలానికి పెద్దపీట

- చైర్మన్‌తో సహా సభ్యులుగా ఏడుగురికి చోటు

పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జోగిపేట వ్యవసాయ శాఖ డివిజన్ ఆత్మ కమిటీ నియామకంలో ఉమ్మడి పుల్కల్ మండలానికి పెద్దపీట వేశారు. మంత్రి దామోదర్ రాజనరసింహ సిఫారసు మేరకు ప్రభుత్వం చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి (చక్రియాల)ని నియమించిన విషయం తెలిసిందే. ఈ కమిటీలో చైర్మన్‌తో సహా మరో 23 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. పుల్కల్ మండలానికి చెందిన వివిధగ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలైన ఏడుగురికి అవకాశం కల్పించగా, అందోలు, హత్నూర మండలాల నుండి 16 మంది సభ్యులను నియమించారు. ఉమ్మడి పుల్కల్ మండలం నుంచి కమిటీ సభ్యులుగా కోడూరి రామస్వామి(శివంపేట), మూడ్ రాములు(బొమ్మారెడ్డి గూడెం గిరిజనతండా), నందికంటి కమలమ్మ(సింగూరు), రమావత్ మీనాబాయి(గొంగ్లూరు గిరిజనతండా), భూమక్కల లింగయ్య(ఎస్.ఇటిక్యాల), మన్నె విఠల్(పుల్కల్), పడమటి యాదయ్య(ముదిమాణిక్యం)లు నియమితులైన వారిలో ఉన్నారు. కమిటీ చైర్మన్, సభ్యులు రెండేళ్లపాటు కొనసాగనున్నారు. మంత్రితో చర్చించి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఖరారు చేయనున్నట్లు కాంగ్రెస్‌వర్గాలు తెలిపాయి.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



డోవూరు లొంక హనుమాన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

మనూరు/పుల్‌కల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం సొంత ఖర్చులతో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని డోవూరు లొంక హనుమాన్‌తండా వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. డోవూరు గ్రామానికి చెందిన వెంకట్ పదేళ్ల నుంచి సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, అంబాదాస్, ఓంప్రకాష్, అనిల్ రెడ్డి, విఠల్‌రెడ్డి, ప్రవీణ్, గుండయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పుల్‌కల్ మండలంలోని మిన్‌పూర్ గ్రామంలో పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సింగూరు-సంగారెడ్డి ప్రధాన రహదారి బస్టాండ్ వద్ద గ్రామస్తులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చౌటకూర్ మండలం శివంపేటలో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ ప్రారంభించారు.